సాక్షి తిరుపతి

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



ప్రజాసేవే లక్ష్యంగా..

సాక్షి, తిరుపతి: ప్రజాసేవే లక్ష్యంగా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. -IIలో



వెండి ఉరువుల అందజేత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శ్రీవల్లీ దేవసేన సమేత చెంగల్వరాయ స్వామికి వెండి ఉరువులు విరాళంగా అందజేశారు. -IIలో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	26
చిత్తూరు	36	25
తిరుమల	31	21
గూడూరు	37	27
నగరి	37	26

న్యూస్‌రీల్

మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం



ఆలయం వెలుపల మంత్రి ఆర్కే రోజా దంపతులు

తిరుమల: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధిస్తుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆమె తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. దేవుడి ఆశీస్సులతో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. లోకేష్ విమర్శలకు ఆధారాలుంటే కోర్టులో సబ్మిట్ చేయాలని హితువు పలికారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలలకు ఈనెల 21 నుంచి మే 31వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు ఆర్ఐఓ వీ.రమేష్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వేసవి సెలవుల్లో తరగతులు, అడ్మిషన్లు చేపట్టకూడదని, ఎవరైనా అతిక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వైభవంగా నృసింహుని కల్యాణం



కల్యాణోత్సవంలో అర్చకులు

రాపూరు: పెంచలకోన క్షేత్రంలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణోత్సవాన్ని వేదపండితులు శనివారం కనులపండువగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు సుప్రభాతం, అభిషేకం, పూలంగిసేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి వారి నిత్య కల్యాణ మండపంలో ఉత్సవవిగ్రహాలు కొలువుదీర్చి సుందరంగా అలంకరించారు. అనంతరం శాస్త్రోక్తరంగా కల్యాణం జరిపించారు.

షాదీ మహల్ నిర్మాణానికి రూ.40లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి : పట్టణంలో అధునాతన వసతులతో షాదీమహల్ నిర్మించనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి రూ.40లక్షల విరాళాన్ని ప్రకటించారు. శనివారం ప్రధాన ఈద్గా మైదానంలో ముస్లింలు నిర్వహించిన రంజాన్ పండుగ ప్రార్థనలకు ఆయన హాజరై మాట్లాడారు. తొలి విడతగా రూ.2 లక్షలను మత పెద్దలకు ఎమ్మెల్యే అందజేశారు. శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, మైనారిటీ నాయకులు సిరాజ్‌బాషా, గోరా, ఫజల్, గయాజ్, పఠాన్ ఫరీద్, బాబు, బావాజీ, జిలానీ, షరీఫ్ పాల్గొన్నారు.

రంజాన్ ముబారక్!



చిల్లకూరు: రంజాన్ పర్వదిన్నాన్ని పురస్కరించుకొని సముద్రతీరంలో ముస్లింలతో కలిసి ఏరూరు గ్రామానికి చెందిన సైకత శిల్పకారుడు మంచాల సనత్‌కుమార్ సైకత శిల్పాన్ని రూపొందించారు. రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.

నిత్యం భక్తులు, యాత్రికులతో సందడిగా ఉండే ఆధ్యాత్మిక నగరం తిరుపతిని మరింత అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. శ్రీవారి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇప్పటికే ట్రాఫిక్ పద్మవ్యూహం నుంచి బయటపడేలా శ్రీనివాస సేతును నిర్మించగా.. ఇప్పుడు కొత్తగా ఇంటిగ్రేటెడ్ బస్టాండ్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసింది. దీంతోపాటే రెండు రోప్‌వేలను కూడా ఏర్పాటు చేస్తే మరింత అనుకూలంగా ఉంటుందని యోచిస్తోంది.

రోప్ వే



బస్టాండ్‌పై రోప్‌వే, హెలిప్యాడ్ నమూనా



- ఆధ్యాత్మిక నగరానికి మరో మణిహారం
- శ్రీవారి భక్తులకు అనుకూలంగా బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్.. అలిపిరి వరకు
- రెండు రోప్ వేల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం
- డీపీఆర్ సిద్ధం చేస్తున్న ప్రభుత్వం.. త్వరలో ప్రకటన

సాక్షి, తిరుపతి: శ్రీవారి భక్తుల కోసం ప్రభుత్వం మరో రవాణా మార్గాన్ని ఏర్పాటు చేయనుంది. తిరుపతి బస్టాండ్, రైల్వేస్టేషన్ నుంచి అలిపిరి వరకు రెండు రోప్ వేలు ఏర్పాటు చేయడానికి డీపీఆర్ తయారు చేస్తోంది. తిరుమల శ్రీవారి దర్శనం, జిల్లాలోని వివిధ పర్యాటక ప్రాంతాలను చూసేందుకు రోజూ సుమారు 2.5 లక్షల మంది



బస్టాండ్‌పైన రోప్ వే నమూనా చిత్రం

తిరుపతికి వచ్చి వెళ్తుంటారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరుస్తోంది. ఇందులో భాగంగా విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుగా అభివృద్ధి చేస్తోంది. అదేవిధంగా తిరుపతి రైల్వేస్టేషన్‌ను అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దేలా కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి పెంచింది. తాజాగా ప్రస్తుతం ఉన్న బస్టాండ్‌ని తొలగించి అదే స్థలంలో రూ.500 కోట్లతో అత్యాధునిక హంగులతో ఇంటిగ్రేటెడ్ బస్టాండ్ నిర్మించేందుకు రంగం సిద్ధమైంది. ఇదిలా ఉంటే.. మరో వైపు భక్తులు, యాత్రికుల కోసం 'రోప్ వే' నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా వారం కిత్రం నిర్వహించిన తిరుపతి కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం రోప్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపి ప్రభుత్వానికి నివేదించింది. రోప్ వేకు సంబంధించి డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. పూర్తయ్యాక టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నారు.

రోప్ వే ఇలా..

తిరుపతి నగరంతోపాటు రైల్వేస్టేషన్‌కు చేరుకునే భక్తులు కొందరు బస్టాండ్ నుంచి బస్సుల్లో తిరుమలకు వెళ్తుంటారు. మరికొందరు అలిపిరి నుంచి కాలినడకన కొండకు చేరుకునేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఇంకొందరు అలిపిరి నుంచి వాహనాల్లో తిరుమలకు వెళ్తుంటారు. అటువంటి వారి కోసం ప్రభుత్వం ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు తిరుపతి బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్‌కి ఒక లైను.. బస్టాండ్ నుంచి అలిపిరికి మరో లైను ఏర్పాటు చేయనుంది. నూతనంగా నిర్మించనున్న బస్టాండ్‌పై నుంచి రోప్ వే మార్గాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఆ పక్కనే హెలిప్యాడ్ కూడా ఏర్పాటు చేసి.. అక్కడి నుంచి నేరుగా రోప్ వే మార్గం ద్వారా అలిపిరికి చేరుకునేలా చర్యలు చేపడుతోంది. భక్తులు, యాత్రికులు బస్టాండ్‌లో దిగి బస్సెక్కి అలిపిరికి వెళ్లే శ్రమలేకుండా ఈ రోప్ వే గుండా వెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

నాడు రోప్‌వే అంటూ హడావుడి

టీడీపీ హయాంలో అలిపిరి నుంచి అని ఓ సారి, మరో సారి చంద్రగిరి, శ్రీనివాసమంగాపురం నుంచి రోప్ వే వేస్తామంటూ చంద్రబాబు హడావుడి చేశారు. అలిపిరి నుంచి మెట్లమార్గం మీదుగా తిరుమలకు చేరేలా.. మరొకటి శ్రీనివాసమంగాపురం నుంచి అవ్వాచారి కోన మీదుగా తిరుమలకు చేరేలా రోప్ వేలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. వచ్చే ఏడాది.. ఈ ఏడాది అంటూ అప్పటి పాలకమండలి చెప్పుకొచ్చింది. అయితే వారి ఆలోచనలు ఏ ఒక్కటీ అమలు కానివి అని నాడే నిపుణులు తేల్చేశారు. ఒకటి అవ్వాచారి కోన మీదుగా రోప్‌వే ఏర్పాటు చేస్తే.. ఏదైనా ప్రమాదం సంభవిస్తే పరిస్థితులు దారుణంగా ఉంటాయని తేల్చిచెప్పారు. అదేవిధంగా మెట్ల మార్గం మీదుగా ఏర్పాటు చేస్తే.. ఆలయాలపై వెళ్లినట్లు ఉంటుందని భక్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా టీడీపీ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు రోప్ వే ఏర్పాటు చేస్తామంటూ చెప్పుకుంటూ వచ్చి చివరికి చేతులెత్తేశారు.

> **రోప్‌వే మరో మణిహారం**
>
> అభివృద్ధి చెందుతున్న తిరుపతి మహానగరానికి రోప్ వే మరో మణిహారం కానుంది. రోప్ వే ఏర్పాటుకు కౌన్సిల్ కూడా తీర్మాణం చేసింది. డీపీఆర్‌లు చేసేపనిలో ఉన్నాం. రోప్ వే త్వరలో కార్యరూపం దాల్చనుంది. దీని ద్వారా భక్తులు, యాత్రికుల రవాణా సమయాన్ని తగ్గించడంతో పాటు.. ఆహ్లాదాన్ని అందిస్తాం.
>
> -ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

మరింత రుచికరంగా అన్నప్రసాదం

- అన్నప్రసాద నాణ్యతపై టీటీడీ దృష్టి
- మిల్లర్ల నుంచి బియ్యం కొనుగోలు చేయాలని నిర్ణయం



అన్నప్రసాదం వడ్డిస్తున్న టీటీడీ చైర్మన్ (ఫైల్)

తిరుమల: అన్నం పరబ్రహ్మస్వరూపం అంటారు పెద్దలు. ఆ మాటను టీటీడీ నిజం చేస్తోంది. తిరుమలకు విచ్చేసే భక్తులకు నిత్యాన్నప్రసాద సముదాయంలో ఉచితంగా భోజన సౌకర్యం కల్పిస్తోంది. ఇప్పటి వరకు అన్నప్రసాద ట్రస్ట్‌కి అందిన విరాళాలు రూ.1,500 కోట్లు. దీంతో నిత్యం లక్ష మందికి పైగా భక్తులుకు ఉచితంగా అన్నప్రసాద సౌకర్యం కల్పిస్తోంది. 15 టన్నుల బియ్యం, 7 నుంచి 8 టన్నుల కూరగాయలను వినియోగిస్తోంది. దాతలు విరాళంగా నిత్యం 7 నుంచి 8 టన్నుల కూరగాయలను అందిస్తుండగా..మిగిలిన ముడిసరుకులను టీటీడీ టెండర్ ద్వారా కొనుగోలు చేస్తోంది. ఇలా ఒక్కరోజు అన్నప్రసాద నిర్వహణకు రూ.30 లక్షల వరకు వెచ్చిస్తోంది.

విమర్శలకు తావులేకుండా..

తిరుమలలో నిత్యం 50 వేల నుంచి లక్ష మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. దీంతో అన్న ప్రసాద నాణ్యతకు టీటీడీ ప్రాధాన్యమిస్తోంది. ఎలాంటి లాభాపేక్ష లేకుండా బియ్యం సరఫరా చేసేందుకు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన మిల్లర్లు ముందుకు రావడంతో టీటీడీకి నాణ్యమైన బియ్యం అందేవి. కానీ కోవిడ్ కారణంగా ఈ విధానానికి బ్రేక్‌పడింది. దీంతో టీటీడీ తిరిగి టెండర్ ప్రక్రియలో బియ్యం కొనుగోలు ప్రారంభించింది. నాణ్యమైన బియ్యం అందు బాటులోకి రాకపోవడంతో టీటీడీపై విమర్శలు ప్రారంభమయ్యాయి. దీంతో టీటీడీ మళ్లీ మిల్లర్ల నుంచి బియ్యం కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

మిన్నంటిన రంజాన్ సంబరాలు



తిరుపతి ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



ముస్లిం చిన్నారులతో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే భూమన



ముస్లింలతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

- జిల్లా వ్యాప్తంగా సామూహిక ప్రార్థనలు
- ఈద్‌ముబారక్, ఆత్మీయ ఆలింగనంతో పులకించిన ముస్లింలు
- శుభాకాంక్షలు తెలిపిన రాజకీయ ప్రతినిధులు, ప్రముఖులు

తిరుపతి కల్చరల్: పవిత్రమైన రంజాన్ సంబరాలు శనివారం జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటాయి. అత్యంత భక్తిశ్రద్ధలతో సామరస్యం చాటుతూ ముస్లింలు రంజాన్ వేడుకలను జరుపుకున్నారు. నెల రోజుల పాటు నిష్టతో ఉపవాస దీక్షలు చేసి చివరి రోజు నెల వంకను దర్శించుకొని ముస్లింలు భక్తి ప్రపత్తులతో రంజాన్ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శనివారం ఉదయం రంజాన్ ఈదుల్ ఫితర్ ప్రత్యేక నమాజుకు ఆయా ప్రాంతాలకు చేరుకున్నారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపేందుకు పలువురు రాజకీయ ప్రతినిధులు, ప్రముఖులు సామూహిక నమాజ్ ప్రాంతాలకు చేరుకొని ముస్లింలను ఆప్యాయంగా పలకరిస్తూ వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు ఆలింగనంతో ఈద్ ముబారక్ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుని పులకించారు. అల్లాను స్మరిస్తూ ఈదుల్ ఫితర్ ప్రత్యేక నమాజును చేపట్టారు. తిరుపతి ఎస్వీయూనివర్సిటీ సమీపంలోనున్న ఈద్గా మైదానంలో రంజాన్ వేడులను ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ డాక్టర్ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష హాజరై ముస్లింల రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చంద్రగిరి నియోజకవర్గం చిన్నగొట్టిగల్లులో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లిం మత గురువులు దువా చేసి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఆశీర్వదించారు.

ఆకాశమే హద్దుగా!

- వాణిజ్యపరమైన ప్రయోగాల్లో ఇస్రో దిట్ట
- ఇప్పటికే 422 విదేశీ ఉపగ్రహాలు కక్ష్యలోకి
- తాజాగా సింగపూర్‌కు చెందిన రెండు ఉపగ్రహాలు కూడా..

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) వాణిజ్యపరమైన ప్రయోగాలలో ఆకాశమే హద్దుగా దూసుకుపోతోంది. శ్రీహరికోట రాకెట్ కేంద్రం భూమధ్యరేఖకు 13 డిగ్రీల అక్షాంశంలో ఉండడంతో గ్రావిటి పవర్ తక్కువగా ఉంటోంది. అందుకే ఇక్కడ వాణిజ్యపరమైన ప్రయోగాలకు తక్కువ వ్యయం అవుతోంది. అందుకే ప్రపంచదేశాల్లో చాలాదేశాలు న్యూస్పేస్ ఇండియా వారితో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. రెండు టన్నులకు మించి బరువు కలిగిన అతి పెద్ద ఉపగ్రహాలను ఫ్రాన్స్, రష్యా అంతరిక్ష కేంద్రాల నుంచి పంపిస్తుండగా.. అతిచిన్న విదేశీ ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ ద్వారా ప్రయోగించి వాణిజ్యపర ప్రయోగాలకు ఇస్రో కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఇప్పటిదాకా 57 పీఎస్ఎల్వీ, రెండు ఎల్వీఎం3 రాకెట్‌ల ద్వారా 35 దేశాలకు చెందిన 422 విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. మరో ఏడు దేశాలకు చెందిన ఉపగ్రహాలను ప్రయోగించేందుకు ఎంఓయూ చేసుకున్నట్టు ఇస్రో ప్రకటించింది. సంవత్సరానికి సుమారు వెయ్యి కోట్లుకు పైగా వాణిజ్యపరంగా ఆదాయాన్ని ఆర్జిస్తోంది. శనివారం మధ్యాహ్నం 2.20 గంటలకు సింగపూర్‌కు చెందిన రెండు ఉపగ్రహాలను ప్రయోగించి ఈ ఏడాది రెండో వాణిజ్యపరమైన విజయాన్ని అందుకుంది.

పీఎస్ఎల్వీ సీ55 రాకెట్ గమనం ఇలా..


శనివారం షార్ నుంచి పీఎస్ఎల్వీ సీ55 రాకెట్ ప్రయాణం దశల వారీగా విజయవంతమైంది. రాకెట్ నాలుగు దశలు దిగ్విజయంగా పనిచేస్తూ సింగపూర్‌కు చెందిన రెండు ఉపగ్రహాలను నిర్దేశిత సమయంలో నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. 44.4 మీటర్ల పొడవు కలిగి 228 టన్నులతో నింగివైపునకు తన ప్రయాణాన్ని కొనసాగించింది. రాకెట్‌లోని మొదటి దశలో నింపిన 139 టన్నుల ఘన ఇంధనంతో 110.5 సెకెండ్లకు పూర్తిచేశారు. 41 టన్నుల ద్రవ ఇంధనంతో రెండో దశను 261.7 సెకెండ్లకు, 7.65 టన్నుల ఘన ఇంధనంతో మూడో దశను 588 సెకెండ్లకు పూర్తిచేశారు. నాలుగో దశలో 0.8 టన్నుల ద్రవ ఇంధనంతో 1,115 సెకెండ్లకు కటాఫ్ చేశారు. ఆ తర్వాత 19.55 నిమిషాలకు ముందుగా 781 కిలోల బరువు కలిగిన టెలియోస్-2 ఉపగ్రహాన్ని, 20.55 నిమిషాలకు లూమిలైట్-4 ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టి విజయం సాధించారు.



వాణిజ్యపరమైన ఉపగ్రహాలను మోసుకుని వెళుతున్న పీఎస్ఎల్వీ సీ55



మొదటి దశ : నింగివైపు..



రెండో దశ : మండుతూ.. నింగివైపు దూసుకుపోతూ..



మూడోదశ : దూసుకుపోతున్న పీఎస్ఎల్వీ రాకెట్



నాలుగో దశ: ఉపగ్రహాలను మోసుకెళ్తూ ..



టెలియోస్-2 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి వదిలిపెడుతూ..



లూమిలైట్-4 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి వదిలిపెడుతూ..

భ్రమలు కల్పించొద్దు 'బాబు'!


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తన పుట్టిన రోజున పేదలను కోటీశ్వరులను చేసే పథకం అంటూ ప్రకటన చేయడం వారిని ఫూల్ చేయడమేనని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం విమర్శించారు. శనివారం రెడ్డిరెడ్డి కాలనీలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మట్లాడారు. ఊకదంపుడు ఉపన్యాసాలు, వీడియో కాన్ఫరెన్స్‌లు, మార్కెటింగ్ మాయాజాలంతో రాష్ట్రం మరో సింగపూర్ అయినట్లు భ్రమలు కల్పించడంలో తెలుగు దేశం పార్టీ పీహెచ్‌డీ చేసిందన్నారు. గత 14 ఏళ్ల బాబు ముఖ్యమంత్రిగా పనిచేసినా ఆంధ్రలో 65 శాతం పేదలు ఉండిపోయారంటే ఆయన మాయా జాలం మహిమ ఏపాటిదో అర్థమవుతోందని విమర్శించారు. వైఎస్‌ఆర్‌సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలు, ఫీజు రియింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, గృహాలు వంటి పథకాలతో లక్షల రూపాయలను ప్రతి పేద కుటుంబానికీ అందించారని గుర్తుచేశారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన చంద్రబాబుకు ఇప్పుడు ఓట్లు అడిగే హక్కు ఉందా..? అని ప్రశ్నించారు.

ప్రజాసేవే లక్ష్యంగా.. క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు

- అంగన్‌వాడీ, హెల్త్‌క్లినిక్, గ్రామ సచివాలయాలను తనిఖీ చేసిన కలెక్టర్


బాలుడ్ని ఎత్తుకుని పాలు, గుడ్లు, చిక్కీలు ఇస్తున్నారా లేదా? అని అడుగుతున్న కలెక్టర్

సాక్షి, తిరుపతి: 'అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం అందుతుందా లేదా..? గర్భిణుల ఆరోగ్యం ఎలా ఉంది?.. వయస్సుకు తగ్గట్టు పిల్లల బరువు ఉందా?.. హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు వైద్యసేవలు ఎలా అందుతున్నాయి?.. ఫ్యామిలీ డాక్టర్ ఇంటికి వస్తున్నారా?.. గ్రామ సచివాలయాల నిర్వహణ ఎలా ఉంది?.. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం నెరవేరుతుందా లేదా?' అనే విషయాలపై తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తిరుపతి రూరల్ పరిధిలోని వెంకటపతినగర్‌లో ఆయన పర్యటించారు. ముందుగా విలేజ్ హెల్త్ క్లినిక్, అనంతరం అంగన్వాడీ కేంద్రం, గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సూచికలపై, అసంక్రమిత, సంక్రమిత వ్యాధుల ఫాలోఅప్, అంగన్‌వాడీ సేవలు, రక్తహీనత, గర్భిణులు, క్యాన్సర్ పేషంట్ల ఆరోగ్య పరిస్థితులపై కలెక్టర్ సమీక్షించారు. మంచానికే పరిమితమైన రోగులను వారి నివాసానికే వెళ్లి పరామర్శించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్యులు ఇంటికే వచ్చి సేవలు అందిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. గర్భిణులు, కౌమార దశలోని బాలికలు అనీమియాతో బాధపడుతున్న వారి వివరాలు ఏఎన్ఎంను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న గర్భిణీ స్త్రీలతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ, ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాలు, గుడ్లు, చిక్కీలు ఇస్తున్నారా?

అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ పిల్లలతో ముచ్చటించారు. చిక్కీలు, గుడ్లు, పాలు వంటి పౌష్టికాహారం అందుతుందా..? అని అడిగి తెలుసుకున్నారు. బరువు తక్కువ ఉన్న 12 మంది పిల్లల్లో ఒకరి బరువును స్వయంగా తూచి పరిశీలించారు. బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 104 వాహనం ద్వారా డాక్టర్, ఏఎన్ఎం ఇంటికే వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. పక్షవాతం, డయాబెటిస్, రక్తపోటు వంటి వ్యాధితో బాధపడుతున్న వారి నివాసాలకు వెళ్లి 104 సేవలు వినియోగంపై ఆరా తీశారు.

ఇంకా..

- హౌసింగ్‌కు సంబంధించి తొండవాడ లేఔట్ లబ్ధిదారులతో ఇళ్ల పురోగతిపై ఆరా తీశారు.
- ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణ తనిఖీల్లో భాగంగా వెంకటపతి నగర్ గ్రామ సచివాలయాన్ని సందర్శించారు.

ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారి జయలక్ష్మి, డీఎల్‌డీఓలు సుశీలాదేవి, ఆదిశేషారెడ్డి, అదనపు సీడీపీఓ జ్యోతి, తిరుపతి రూరల్ తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ మెరుగుపడాలి


తడ పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

తడ: సమాజంలో ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన తడ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి, పలు రికార్డులను పరిశీలించారు. షార్‌లో జరిగిన రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు విచ్చేసిన ఆయన తిరుగు ప్రయాణంలో తడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. సచివాలయ పోలీస్ సిబ్బందిని సమన్వయం చేసుకుని గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు తలెత్తకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి!


వెంకటేష్ మృతదేహం

కేవీబీపురం: పిడుగుపాటుకు పశువుల కాపరి మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ సునీల్ కథనం.. మండలంలోని బ్రాహ్మణపల్లి దళితవాడకు చెందిన బొగ్గుల వెంకటేష్(55) పశువుల కాపరి. శుక్రవారం తన పశువులను అడవికి తోలుకెళ్లాడు. సాయంత్రం పశువులు ఇంటికి చేరినా వెంకటేష్ రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సాయంతో అడవిలో గాలించారు. శనివారం తెల్లవారు జామున అడవికి సమీపంలోని 33 కేవీ విద్యుత్ లైన్ల కింద ఉన్న వరిచేనులో వెంకటేష్ మృతదేహం లభ్యమైంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కాపరి మృతదేహాన్ని పరిశీలించారు. గురువారం పడిన పిడుగుల కారణంగానే వెంకటేశు మృతి చెంది ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య వెంకటమ్మ, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,200
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.78

వెండి ఉరువుల అందజేత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి వేదస్థానంలోని శ్రీవల్లి దేవసేన సమేత చెంగల్వరాయ స్వామికి హైదరాబాద్‌వాసి, అజగ్ర హోం ప్రైవేట్ లిమిటెడ్ అధినేత ఎస్.రామకృష్ణారావు శనివారం వెండి ఉరువులు అందజేశారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులుకు ఆయన రూ.18,30,000 విలువైన వెండి ఆభరణాలు అందజేశారు. స్వామి,అమ్మవార్లకు అలంకరించేందు వీటిని వినియోగించనున్నారు. దేవస్థానం అభిషేక గురుకుల్, రాజేష్ గురుకుల్, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, ఆలయాధికారి దాము, పరిచారకులు మహేష్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఫీడ్ బాయ్ మృతి!

వాకాడు: వాకాడు మండలం, దుగ్గరాజపట్నం గ్రామ సమీపంలోని రొయ్యల గుంట వద్ద వేమాలయ్య(45) అనే ఫీడ్‌బాయ్ శనివారం విద్యుత్ షాక్ గురై మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. శ్రీకాళహస్తి సమీపంలోని జంగాలపల్లికి చెందిన వేమాలయ్య కొన్ని నెలలుగా దుగ్గరాజపట్నం వద్ద ఓ రైతుకు చెందిన రొయ్యల గుంటల వద్ద ఫీడ్‌బాయ్, కాపలాదారుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సాయంత్రం రొయ్యల గుంట అంచున ఉన్న విద్యుత్ స్టార్టర్‌కు మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో ఏమైందో ఏమోగానీ వేమాలయ్య గుంటలో పడి మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. దీనిపై వాకాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం బాలిరెడ్డిపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.